## ఇక శౌర్యంగ పర్వంలోకి..



అగ్ర హీరో ప్రభాస్ ప్రస్తుతం 'కల్కి 2898ఏడీ' 'రాజా సాబ్' చిత్రాలతో బిజీగా ఉన్నారు. 'కల్కి' చిత్రం జూన్ 27న విడుదలకానుంది. ఇప్పటికే ఈ సినిమా చిత్రీకరణ పూర్తయింది. దీంతో ప్రభాస్ తన తదుపరి సినిమా 'సలార్-2' (శౌర్యంగ పర్వం) కోసం సిద్ధమవుతున్నారని తెలిసింది. ఈ నెలాఖరులో ఈ సినిమా షూటింగ్‌ను మొదలుపెట్టబోతున్నారని, తొలి షెడ్యూల్‌లో ప్రభాస్‌తో పాటు ప్రతినాయక పాత్రధారి పృథ్వీరాజ్ సుకుమారన్‌లపై కీలక ఘట్టాలను తెరకెక్కిస్తారని సమాచారం. తొలిభాగంలోనే 'సలార్' సీక్వెల్ గురించి హింట్ ఇచ్చారు దర్శకుడు ప్రశాంత్‌నీల్. ఈ సినిమా స్క్రిప్ట్‌పై ఆయన మరింతగా దృష్టిపెట్టారని, తొలుత అనుకున్నట్లుగా కాకుండా చాలా మార్పులతో సీక్వెల్‌కు స్క్రిప్ట్ సిద్ధం చేశారని అంటున్నారు. వచ్చే ఏడాది డిసెంబర్‌లో ఈ చిత్రాన్ని విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు తెలిసింది.

## భుజమే ఎత్తి నడిసొస్తుంటే భూమి బద్దలయ్యే..



'పుష్ప-2' (ది రూల్) చిత్రంపై దేశవ్యాప్తంగా భారీ హైప్ నెలకొని ఉన్న విషయం తెలిసిందే. తొలి భాగం అపూర్వ విజయాన్ని సొంతం చేసుకోవడం, పుష్పరాజ్ పాత్రకు మాస్ ప్రేక్షకుల్లో మంచి ఫాలోయింగ్ ఏర్పడటంతో ఈ సినిమా కోసం అభిమానులు ఆత్రుతగా ఎదురుచూస్తున్నారు. అల్లు అర్జున్ కథానాయకుడిగా సుకుమార్ దర్శకత్వంలో రూపొందిన ఈ పాన్ ఇండియా చిత్రం ఆగస్ట్ 15న ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకుల ముందుకురానుంది. ఈ నేపథ్యంలో మ్యూజిక్ ప్రమోషన్స్‌లో భాగంగా 'పుష్ప..పుష్ప..పుష్పరాజ్..' అంటూ సాగే తొలి గీతాన్ని బుధవారం విడుదల చేశారు. 'నువ్ గడ్డం అట్టా సవరిస్తుంటే దేశం దద్దరిల్లే, నువ్ భుజమే ఎత్తి నడిసొస్తుంటే భూమి బద్దలయ్యే, నువ్ నిలవాలంటే ఆకాశం ఎత్తే పెంచాలే, నిను కొలవాలంటే సంద్రం ఇంకా లోతే తవ్వాలే..' అంటూ పుష్పరాజ్ ఆటిట్యూడ్‌ను తెలియజేస్తూ, అతనిలోని హీరోయిజాన్ని ఎలివేట్ చేస్తూ ఈ పాట ఆకట్టుకుంది. దేవిశ్రీప్రసాద్ ట్యూన్, చంద్రబోస్ రచన ప్రధానాకర్షణగా ఈ పాట విజువల్ ట్రీట్‌లా సాగింది. ఈ గీతానికి విజయ్ పొల్లంకి, శ్రేష్టి వర్మ నృత్యరీతులను సమకూర్చారు. రష్మిక మందన్న, ఫహాద్ ఫాజిల్, ధనుంజయ్, సునీల్, అనసూయ భరద్వాజ్ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ: మిరోస్లా క్యూబో బ్రోజెక్, సంగీతం: దేవిశ్రీప్రసాద్, నిర్మాతలు: నవీన్ ఎర్నేని, వై.రవిశంకర్, కథ, కథనం, దర్శకత్వం: సుకుమార్.బి.



## సెంచరీ కొట్టింది



కన్నడ సోయగం రష్మిక మందన్న వృత్తిపరంగా ఎంత బిజీగా ఉన్నా ఫిట్‌నెస్ విషయంలో ఏమాత్రం నిర్లక్ష్యం ప్రదర్శించదు. తన వర్కవుట్ వీడియోలను తరచుగా సోషల్‌మీడియా లో షేర్ చేస్తుంటుంది. తాజాగా ఈ భామ ఏకంగా 100కిలోల డెడ్‌లిఫ్ట్‌ను ఎత్తిపడేసింది. ఈ వీడియోను తన ఇన్‌స్టాగ్రామ్ స్టోరీలో పంచుకుంది. "కుబేర' సినిమా నైట్ షూట్స్‌తో చాలా బిజీగా ఉన్నా. ఉదయం 8గంటలకు హోటల్ రూమ్‌కి చేరుకున్నా. ఎందుకో తెలియదు కానీ నిద్ర పట్టలేదు. దాంతో పుస్తకం చదువుతూ కూర్చున్నా. మధ్యాహ్నం 12 గంటలకు నిద్రపోయి సాయంత్రం లేచాను. భోజనం పూర్తయ్యాక అర్ధరాత్రి 1 గంట సమయంలో జిమ్‌కి వెళ్లాను. కార్డియో చేద్దామంటే మూడ్ రాలేదు. దాంతో వంద కిలోల డెడ్‌లిఫ్ట్ చేశాను. ఒక్కసారిగా ఒత్తిడి మొత్తం మాయమైపోయింది' అంటూ ఇన్‌స్టా స్టోరీలో రాసుకొచ్చింది రష్మిక. ప్రస్తుతం ఈ వీడియో వైరల్‌గా మారింది.



## డీజే టిల్లు జోడీగా..

అగ్ర కథానాయిక పూజాహెగ్డేకు గత కొంతకాలంగా అదృష్టం కలిసి రావడం లేదు. వరుస పరాజయాలతో ఈ భామ కెరీర్ సాగుతున్నది. ప్రస్తుతం సినిమాలకు కాస్త బ్రేక్‌నిచ్చి కుటుంబ సభ్యులతో విరామ సమయాల్ని గడుపుతున్నది. తాజా సమాచారం ప్రకారం తెలుగు ఇండస్ట్రీ నుంచి ఈ అమ్మడు ఓ గుడ్‌న్యూస్‌ను అందుకున్నట్లు తెలిసింది. వివరాల్లోకి వెళితే..టిల్లు, టిల్లు స్క్వేర్ చిత్రాలు యువతరంలో మంచి ఆదరణ దక్కించుకున్నాయి. టిల్లు పాత్రలో హీరో సిద్ధు జొన్నలగడ్డ తనదైన మేనరిజమ్స్, హైదరాబాదీ కామెడీతో ఆకట్టుకున్నారు. ఈ రెండు చిత్రాలకు కొనసాగింపుగా 'టిల్లు క్యూబ్' తెరకెక్కబోతున్న విషయం తెలిసిందే. ప్రస్తుతం ఈ సినిమా స్క్రిప్ట్‌ను సిద్ధం చేసే పనిలో ఉన్నారు హీరో సిద్ధు జొన్నలగడ్డ. తాజా సమాచారం ప్రకారం ఈ సినిమాలో కథానాయికగా పూజాహెగ్డేను ఎంపిక చేసినట్లు తెలిసింది. డీజే టిల్లు, టిల్లు స్క్వేర్ చిత్రాల్లో కథానాయిక పాత్రలకు చాలా ప్రాధాన్యత ఉన్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో మూడో భాగంలో పూజహెగ్డేను కథానాయికగా తీసుకోబోతున్నారని వార్తలొస్తున్నాయి. అయితే ఈ వార్తలో నిజమెంతో తెలియాలంటే చిత్ర బృందం నుంచి అధికారిక ప్రకటన రావాల్సిందే.



## థౌజండ్ పర్సంట్ బ్లాక్‌బస్టర్

'ఈ సినిమా విజయంపై ఎలాంటి సందేహం లేదు. థౌజండ్ పర్సంట్ బ్లాక్‌బస్టర్ హిట్ అని నమ్మకంగా చెబుతున్నా' అన్నారు సుహాస్. ఆయన కథానాయకుకుడిగా నటించిన తాజా చిత్రం 'ప్రసన్నవదనం' ఈ నెల 3న ప్రేక్షకుల ముందుకురానుంది. అర్జున్ కె దర్శకత్వం వహించిన ఈ చిత్రాన్ని జేఎస్ మణికంఠ, టీ.ఆర్.ప్రసాద్ రెడ్డి నిర్మించారు. ఈ సందర్భంగా బుధవారం నిర్వహించిన పాత్రికేయుల సమావేశంలో సుహాస్ మాట్లాడుతూ..సరికొత్త కాన్సెప్ట్‌తో ఈ సినిమాను తెరకెక్కించారని, ఆద్యంతం ఉత్కంఠభరితమైన కథ, కథనాలతో ఆకట్టుకుంటుందని, ప్రేక్షకులు చప్పట్లు కొడుతూ ఆస్వాదిస్తారని చెప్పారు. ఈ కథలో ఫన్, థ్రిల్, రొమాన్స్, ఎమోషన్స్ అన్నీ ఉంటాయని దర్శకుడు అర్జున్ పేర్కొన్నాడు. సమ్మర్ ట్రీట్‌లా ప్రేక్షకుల్ని మెప్పిస్తుందని నిర్మాత టీఆర్ ప్రసాద్ రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో చిత్ర యూనిట్ సభ్యులందరూ పాల్గొన్నారు.



## ఇద్దరు ఖైదీల కథ

మోహన్ భగత్, సుప్రిత సత్యనారాయణ్, భూషణ్ కల్యాణ్, రవీంద్ర విజయ్ కీలక పాత్రల్లో నటించిన చిత్రం 'ఆరంభం'. అజయ్ నాగ్ దర్శకుడు. అభిషేక్ వీటీ నిర్మించారు. ఈ నెల 10న విడుదలకానుంది. బుధవారం ట్రైలర్‌ను విడుదల చేశారు. కన్నడ నవల ఆధారంగా ఈ కథ తయారుచేసుకున్నానని, జైలు నుంచి తప్పించుకున్న ఇద్దరు ఖైదీలను పట్టుకునేందుకు ఇద్దరు డిటెక్టివ్‌లు రంగంలోకి దిగుతారని, వారికి దొరికిన ఓ డైరీ చుట్టూ కథ నడుస్తుందని దర్శకుడు అజయ్ నాగ్ తెలిపారు. తన క్యారెక్టర్‌లో డిఫరెంట్ షేడ్స్ ఉంటాయని హీరో మోహన్ భగత్ తెలిపారు. ఇన్నోవేటివ్ కాన్సెప్ట్‌తో ఈ సినిమా ప్రేక్షకులకు సరికొత్త అనుభూతినందిస్తుందని నిర్మాత అభిషేక్ వీటీ తెలిపారు. ఈ చిత్రానికి కెమెరా: దేవ్‌దీప్ గాంధీ, సంగీతం: సింజిత్ యెర్రమిల్లి, దర్శకత్వం: అజయ్‌నాగ్ వీ.

## హారర్ కామెడీగా 'తిండిపోతు దెయ్యం'



నరసింహ బోదాసు, మోనికా సమత్తార్, తన్నీరు వాసవి హీరో హీరోయిన్లుగా నటించిన 'తిండిపోతు దెయ్యం' చిత్రం ఇటీవలే హైదరాబాద్‌లో ప్రారంభమైంది. శ్రీశౌర్య క్రియేషన్స్ పతాకంపై స్వీయ దర్శకత్వంలో నరసింహ బోదాసు తెరకెక్కిస్తున్నారు. ముహూర్తపు సన్నివేశానికి రేలంగి నరసింహారావు క్లాప్‌నిచ్చారు. హారర్ కామెడీ కథాంశమిదని, కథలోని కొత్తదనం ఆకట్టుకుంటుందని దర్శకుడు, హీరో నరసింహ బోదాసు చెప్పారు. వినూత్న కథా చిత్రంలో నటించడం ఆనందంగా ఉందని నాయికానాయికలు పేర్కొన్నారు. ఈ చిత్రానికి కెమెరా: మహేందర్ ఎం, సంభాషణలు: శ్రీకాంత్ సాయి, నిర్మాత: శిరీష నరసింహ బోదాసు, కథ, స్క్రీన్‌ప్లే, దర్శకత్వం: నరసింహ బోదాసు.



## రజనీకాంత్ బయోపిక్‌లో..

సాధారణ బస్‌కండక్టర్‌గా జీవితాన్ని ప్రారంభించి సూపర్‌స్టార్‌గా ఎదిగారు రజనీకాంత్. ఆయన స్ఫూర్తిదాయక జీవితం వెండితెర దృశ్యమానం కానుంది. ప్రముఖ బాలీవుడ్ నిర్మాత సాజిద్ నడియావాలా రజనీకాంత్ బయోపిక్‌ను తెరకెక్కించేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు తెలిసింది. ప్రస్తుతం పూర్వ నిర్మాణ పనులు జరుపుకుంటున్న ఈ చిత్రాన్ని వచ్చే ఏడాది సెట్స్‌మీదకు తీసుకురానున్నట్లు తెలిసింది. రజనీకాంత్ పాత్రలో ధనుష్ నటించనున్నారని వార్తలొస్తున్నాయి. ఇటీవల రజనీకాంత్‌తో తీయించుకున్న ఓ ఫొటోను నిర్మాత సాజిద్ నడియావాలా తన సోషల్‌మీడియా ఖాతాలో పంచుకున్నారు. ఈ నేపథ్యంలో రజనీకాంత్ బయోపిక్ గురించి బాలీవుడ్ ఇండస్ట్రీలో వార్తలొస్తున్నాయి. అయితే ఈ విషయమై ఇప్పటి వరకు ఎలాంటి అధికారిక ప్రకటన రాలేదు.

## హోమ్‌గ్రౌండ్‌లో ఆడినట్లుంది!



**గత కొంతకాలంగా సీరియస్ సబ్జెక్ట్స్‌తో సినిమాలు చేస్తున్నానని, మరలా కామెడీ సినిమా చేయడ ఆనందంగా ఉందని చెప్పారు హీరో అల్లరి నరేష్. ఆయన తాజా చిత్రం 'ఆ ఒక్కటీ అడక్కు' ఈ నెల 3న ప్రేక్షకుల ముందుకురానుంది. మల్లి అంకం దర్శకుడిగా పరిచయమవుతున్న ఈ చిత్రాన్ని రాజీవ్ చిలకా నిర్మించారు. ఈ సందర్భంగా బుధవారం అల్లరి నరేష్ పాత్రికేయులతో పంచుకున్న విశేషాలు..**

- ఈ చిత్రానికి నాన్నగారి సినిమా టైటిల్ పెట్టేసరికి పోలిక తీసుకొస్తారేమోనని కాస్త భయపడ్డాను. అయితే రెండు కథలకు ఎలాంటి సంబంధం ఉండదు. కథానుగుణంగా యాప్ట్ టైటిల్ దొరికింది. ఈ సినిమాలో హీరోకి ఏజ్‌బార్ అయినప్పటికీ పెళ్లి కాదు, అందరూ పెళ్లెప్పుడు? పప్పన్నం ఎప్పుడు పెడుతున్నావ్? అని అడుగుతుంటారు. ఆ చికాకులో చెప్పే డైలాగ్ 'ఆ ఒక్కటీ అడక్కు'
- పెళ్లి నేపథ్యంలో నడిచే ఈ కథలో చక్కటి వినోదంతో పాటు సందేశం కూడా ఉంటుంది. పెళ్లి చుట్టూ జరుగుతున్న కోట్ల వ్యాపారం అనే అంశాన్ని వినోదాత్మక కోణంలో చూపిస్తున్నాం. క్లైమాక్స్ ఘట్టాలు మాత్రం భావోద్వేగభరితంగా సాగుతాయి.
- దర్శకుడు మల్లి నిజజీవితంలో జరుగుతున్న సంఘటనలను స్టడీ చేసి ఈ కథను సిద్ధం చేశాడు. కథలో సహజత్వం ఉంటుంది. పెళ్లి చుట్టూ జరిగే స్కామ్స్‌ను చూపించిన విధానం ఆలోచింపజేస్తుంది. అబ్బూరి రవి వంటి ప్రతిభావంతుడైన రచయిత తోడుకావడంతో ఈ సినిమాలో సంభాషణలు, ఎమోషన్స్ మరో స్థాయికి వెళ్లాయి.
- గత కొన్నేళ్లుగా సీరియస్ సబ్జెక్ట్స్‌తో సినిమాలు చేస్తున్నా. మళ్లీ కామెడీ సినిమా చేయడంతో హోమ్ గ్రౌండ్‌లో ఆడినట్లు ఉంది. కామెడీకి గతంలో కంటే ఆదరణ పెరిగింది. వినోదాత్మక చిత్రాలకు ప్రేక్షకులు బ్రహ్మరథం పడుతున్నారు. నా దృష్టిలో కామెడీ చేసి నవ్వించడం చాలా కష్టం.
- ఈ ఏడాది సినిమాల వేగాన్ని పెంచాను. ఈ సినిమాతో పాటు ఈ ఏడాది మరో రెండు సినిమాలు రాబోతున్నాయి. ఈవీవీ బ్యానర్‌ను మళ్లీ మొదలుపెట్టే ఆలోచన ఉంది. మంచి కథ కుదిరితే ఆ బ్యానర్‌లో సినిమాలు చేస్తా. ప్రస్తుతం నటన మీదే దృష్టి పెడుతున్నా. దర్శకత్వం చేసే ఆలోచన లేదు.
- నాకు అన్ని జోనర్స్ సినిమాలు చేయాలని ఉంది. డార్క్ హ్యూమర్ ఉన్న కథలను బాగా ఇష్టపడతాను. ప్రేక్షకులు ఇప్పుడు కథలోంచి పుట్టే కామెడీనే బాగా ఇష్టపడతారు. నాకు వెంకటేష్‌గారితో ఓ సినిమా చేయాలని ఉంది. ఆయన కామెడీ టైమింగ్ సూపర్బ్. అమితాబ్‌బచ్చన్, కమల్‌హాసన్ వంటి లెజెండ్స్‌తో ఒక్క సీన్ అయినా షేర్ చేసుకోవాలనుంది.





